1. అమ్మలగన్నయమ్మ ముగురమ్మల మూలపుటమ్మ చాల పె
ద్దమ్మ సురారులమ్మ కడుపాఱడిపుచ్చినయమ్మ తన్ను లో
నమ్మిన వేల్పుటమ్మల మనమ్ముల నుండెడియమ్మ దుర్గ మా
యమ్మ కృపాబ్ధి యీవుత మహత్వ కవిత్వ పటుత్వ సంపదల్.

2. ఇమ్మనుజేశ్వరాధముల కిచ్చి పురంబులు వాహనంబులున్
సొమ్ములు గొన్ని పుచ్చుకొని సొక్కి శరీరము బాసి కాలుచే
సమ్మెటవాటులం బడక సమ్మతి శ్రీహరి కిచ్చి చెప్పె నీ
బమ్మెర పోతరా జొకడు భాగవతంబు జగద్ధితంబుగన్.

3. ఒనరన్ నన్నయ తిక్కనాదికవులీ యుర్విం బురాణావళుల్
తెనుగుల్ సేయుచు మత్పురాకృత శుభాధిక్యంబు దానెట్టిదో
తెనుగుం జేయరు మున్ను భాగవతమున్ దీనిన్ దెనింగించి నా
జననంబున్ సఫలంబు చేసెద బునర్జన్మంబు లేకుండగన్

4. ఎల్ల శరీరధారులకు నిల్లను చీకటి నూతి లోపలం
ద్రెళ్లక వీరు సే మను మతి భ్రమణంబున భిన్నులై ప్రవ
ర్తిల్లక సర్వము న్నతని దివ్య కళామయమంచు విష్ణునం
దుల్లము జేర్చి తా రడవి నుండుట మేలు నిశాచరాగ్రణీ !

5. అజ్ఞుల్ గొందఱు మేము దామనుచు మాయం జెంది సర్వాత్మకుం
బ్రజ్ఞాలభ్యు వరాన్వయ క్రమములన్ భాషింపగా నేర రా
జిజ్ఞాసా పథమందు మూఢులు గదా! చింతింప బ్రహ్మాది వే
దజ్ఞుల్ త త్పరమాత్ము విష్ణు నితరుల్ దర్శింపగా నేర్తురే ?

6. అచ్చపు జీకటింబడి గృహవ్రతులై విషయ ప్రవిష్టు లై
చచ్చుచు బుట్టుచుం మఱల జర్విత చర్వణు లైన వారికిం
జెచ్చెర బుట్టునే ? పరులు సెప్పిన నైన నిజేచ్ఛ నైన నే
మిచ్చిన నైన గానలకు నేగిన నైన హరిప్రభోధముల్.

7.  కాననివాని నూతగొని కాననివాడు విశిష్ట వస్తువుల్
గాననిభంగి గర్మములు గైకొని కొందఱు కర్మబద్ధులై
కానరు విష్ణు గొందరట గందు రకించిన వైష్ణవాంఘ్రి సం
స్థాన రజోభిషిక్తు లగు సంహృతకర్ములు దానవేశ్వరా !

8. ఇంతింతై వటుడింతయై మఱియు దానింతై నభో వీధిపై
నంతై తోయద మండలాభ్రమున కల్లంతై ప్రభారాశిపై
నంతై చంద్రుని కంతయై ధ్రువునిపై నంతై మహర్వాటిపై
నంతై సత్యపదోన్నతుం డగుచు బ్రహ్మాండాంత సంవర్ధియై.

9.  రవిబింబం బుపమింప బాత్ర మగు ఛత్రంబై శిరోరత్నమై
శ్రవణాలంకృతమై గళాభరణమై సౌవర్ణ కేయూరమై
ఛవిమత్కంకణమై కటిస్థలి నుదంచద్వస్త్ర మై నూపుర
ప్రవరంబై  బదపీఠమై వటుడు దా బ్రహ్మాండము న్నిండుచోన్ .

10. నుతజల పూరితంబులగు నూతులు నూఱిటి కంటె  సూనృత
వ్రత! యొక బావి మేలు, మఱి బావులు నూఱిటికంటె  యొక్క స
త్క్రతు వది మేలు, తత్క్రతు శతంబున కంటె సుతుండు మేలు, త
త్సుతశతకంబు కంటె నొక సూనృత వాక్యము మేలు సూడగన్

11. శారదరాత్రులుజ్జ్వల లసత్తర తారక హారపంక్తులం
జారుతరంబులయ్యె, వికసన్నవ కైరవ గంధబంధురో
దార సమీర సౌరభము దాల్చి సుధాంశు వికీర్యమాణ క
ర్పూరపరాగ పాండురుచిపూరము లంబర పూరితంబులై.

12. సారపు ధర్మమున్ విమల సత్యము పాపము చేత బొంకుచే
బారము బొందలేక చెడబారినదైన యవస్థ దక్షులె
వ్వార లుపేక్ష సేసి రది వారల చేటగు గాని ధర్మని
స్తారకమయ్యు సత్యశుభదాయక మయ్యును దైవముండెడున్.

13. హలికుం డెంతయు నోజతో దునగ సీరాగ్రంబునం జోకి ప్రా
ణులనేకంబులు సచ్చు, హింస యది యౌనో కాదొ, వేయేల? మ
ర్త్యులు నేలం జరియంచుచో బదములం ద్రొక్కంబడుం బెక్కు జం
తులు, హింసావిధి కాదనంగ వశమే దోషజ్ఞ! యూహింపుమా

14.విద్య నిగూఢ గుప్తమగు విత్తము, రూపము పూరుషాళికిన్
విద్య యశస్సు భోగకరి, విద్య గురుండు విదేశ బంధుడున్
విద్య విశిష్ట దైవతము, విద్యకు సాటి ధనంబు లేదిలన్
విద్య నృపాల పూజితము, విద్య నెరుంగని వాడు మర్త్యుడే .

15. ఈసున బుట్టి డెందమున హెచ్చిన కోపదవానలంబుచే
గాసిలి యేడ్చె బ్రాణవిభు కట్టెదుటన్ లలితాంగి పంకజ
శ్రీ సఖమైన మోముపయి జేల చెరంగిడి బాలపల్లవ
గ్రాస కషాయకంఠ కలకంఠవధూ కల కాకలీ ధ్వనిన్.